
# తెలుకుల రవణ

సత్తెమ్మగుడి సందులో నాలుగో ఇల్లు తెలుకుల రవణది. దగ్గర దగ్గర అరెకరంలో గుండ్రంగా కట్టిఉన్న తాటాకు పాకలో ఉంది తెలుకుల గానుగ. రవణ మాలక్ష్మి అని పేరెట్టుకున్న ఆ ఎద్దు చాలా ఆరోగ్యంతో కళ్ళ గంతలతో హాయిగా లాగుతుంది గానుగని. ఆ గానుగకాడి మీద కూర్చున్న రవణ తనతో పాటు తిరుగుతూ నడుస్తున్న నర్సిరెడ్డి ''కార్తీకమాసం వచ్చింది. భోజనాలు ఎక్కడ పెట్టుకుందాం?'' అనడిగేడు.

''లాకులు దాటి కాలవగట్టు మీంచి ముచ్చుమిల్లి వెళ్తుంటే కర్రి రామ్మూర్తిగారి పొలానికీ స్వరాజ్యరెడ్డిగారి పొలానికీ మధ్యలో పెద్ద ఉసిరి చెట్టుందట'' అంది రవణ.



''అయితే ఎప్పుడు పెట్టుకుందాం?'' అడిగేడు నర్సిరెడ్డి.

నవ్విన రవణ ''ఇది మరీ బాగుంది...నన్ను మట్టుకే అడుగుతారేంటి అబ్బుని చీన్నోడ్నీ చెల్లెళ్ళనీ కూడా అడగండి'' అంది.

''నీ మాటకి ఎదురేం మాటాడ్తారు ఆళ్ళు...నువ్వేం చెపితే అదే గదా?'' అన్నాడు నర్సిరెడ్డి.

''అయితే ఈ సోవారమే పెట్టుకుందారి'' అంది.

''సరే ఈ ముక్క వాళ్ళక్కూడా చెబుదాం పద'' అని కదుల్తుండగా చేతిలో షైళ్ళు కాయితాల్తో ఓ పాతికేళ్ళ కుర్రోడొచ్చేడు పాకలోకి.



అతన్ని ఎగాదిగా చూసిన రవణ ''ఎవరు కావాలి నాయినా?'' అంది.

ఆ కుర్రోడు ''నేను జనాబాలెక్కలకోసం మున్సిపాలిటీ నించి వచ్చేను... మీ పేరేంటండీ?'' అనడిగేడు రవణని.

''పొదలాడ వెంకటరవణబాబూ'' అంది రవణ.

ఫైల్లో టిక్కు పెట్టుకున్న ఆ కుర్రోడు ''మీ భర్తపేరు?'' అన్నాడు.

ఆమె నోరు విప్పేలోపే ''పొదలాడ నర్సిరెడ్డి'' అన్నాడు నర్సిరెడ్డి.

టిక్కు పెట్టుకుని వెళ్ళిపోయేడు ఆ అబ్బాయి.

ఓ రెండు గంటలయింది.

గొల్లలతూము పక్కనించే లోపలికెళ్తే బోదికాలవని ఆన్చి ఉంది ఆ పాతకాలం వాడపల్లి పెంకుటిల్లు. ఇంటి బయట గవరారెడ్డి అతని భార్య సూరేకాంతం, లచ్చారెడ్డి అతని భార్య విజయలక్ష్మి ఇంకా వాళ్ళ వాళ్ళ పిల్లల మధ్యలో కూర్చుని వున్నారు నర్సిరెడ్డి, రవణా.

''అయితే ఈ సోవారమే ఖాయం చేసుకుందామంటావా భోజనాలు?'' అడిగేడు నర్సిరెడ్డి.

''అలాగే'' అన్నారంతా. వాళ్ళ మధ్యలోకొచ్చిన జనాభాలెక్కల కుర్రోడు. ఇంట్లో అందరి పేర్లూ కనుక్కుని ''ఈ ఇంటి యాజమాని పేరేంటండి?'' అన్నాడు.

''నల్లమిల్లి నర్సిరెడ్డి'' చెప్పేడు గవరారెడ్డి.

టిక్కు పెట్టుకున్న ఆ అబ్బాయి ''భార్యపేరు?'' అన్నాడు.

''నల్లమిల్లి వెంకటరవణ''.

గబుక్కున తలెత్తిన ఆ అబ్బాయి ''ఇదేంటండీ ఇందాక సత్తెమ్మగుడి సందులో ఉన్న తెలుకుల గానుగ దగ్గర కల్సినప్పుడు ఇళ్ళ పేర్లు వేరే చెప్పేరు ఇప్పుడేంటి మారుస్తున్నారు.

అసలక్కడోసారి నమోదయ్యేక మళ్ళీ ఇక్కడేంటి నాకేం అర్థం గావటం లేదు'' అన్నాడు.

అతని దగ్గరకొచ్చిన లచ్చారెడ్డి ''చాలా ఏళ్ళనించి ఆ పేర్లు అలాగే వస్తున్నాయి. నీ దగ్గరున్న రిజిష్టర్లో అలాగే ఉన్నాయో లేదో చూడు'' అన్నాడు.

చూసిన ఆ అబ్బాయి ''ఉన్నాయండి'' అన్నాడు.

''ఇంకేం మాటాడకండా టిక్కులు పెట్టుకుని వెళ్ళిపో'' అన్నాడు గవరారెడ్డి.

* * *

నర్సిరెడ్డి, గవరారెడ్డి, లచ్చారెడ్డీ అన్నదమ్ములు. ముగ్గుర్లోకీ పెద్దవాడు నర్సిరెడ్డి. రామలక్ష్మి అనే చెల్లెలు చిన్నెప్పుడెప్పుడో పోయింది. రాంపురం కాలేజ్‌లో ఎమ్మేలు చదివి తర్వాత బందరెళ్ళి బిఈడీ ట్రైనింగయ్యి ఊళ్ళోనే ఉజ్జోగాలు సంపాయించుకున్నారు.

ఉమ్మడి కుటుంబం. అన్నగారి మాట తమ్ముళ్ళకి వేదం.

గవరారెడ్డికి ఊబలంక సంబంధం. లచ్చారెడ్డికి తొస్సిపూడి సంబంధం చేసిన నర్సిరెడ్డి రవణకోసం పెళ్ళి చేసుకోలేదు. అతనికీ, రవణకీ వున్న సంబంధం వూళ్ళో అందరికీ తెలుసు. అన్యోన్యమైన వాళ్ళ అనుబంధం గురించి ఎవరూ చెడుగా అనుకోరు.

వీధిలోంచి రవణ వెళ్తుంటే ''ఏంటి రవణా నర్సిరెడ్డి మేష్టారు బాగున్నారా?'' అని పలకరిస్తారు. పుంతరేవు దగ్గర నర్సిరెడ్డి కనబడితే ''ఏంటి రవణ ఎలాగుంది'' అని అడుగుతుంటారు.

పండగలకీ పబ్బాలకీ యర్రమిల్లి పెదెంకట్రాజు కొట్లో బట్టలు కొనుక్కొచ్చి అందరికీ పెడద్ది. వంటలదగ్గరా అదీ సాయపడ్తా వుంటది. ఇంట్లో వాళ్ళందరికీ తెలివైన రవణ అంటే చాలా గౌరవం. ఏ నాడూ ఆమెని చెడుగా అని ఎరగరు. అంతలాగ చూస్తారు. వాళ్ళకే చిక్కొచ్చినా రవణనే అడుగుతారు. గవరారెడ్డీ, లచ్చారెడ్డీ వరసలు పెట్టి పిలవకపోయినా రవణా అనే పిలుపు వదినా అన్నట్టే విన్పిస్తుంది. అబ్బా అని గవర్రెడ్డినీ, చిన్నోడా అని లచ్చారెడ్డినీ పిలుస్తాడు నర్సిరెడ్డి. రవణకూడా అలాగే పిలుస్తుంది. దానికేం నొచ్చుకోరాళ్ళు. పిలిచేది పరాయి మనిషి కాదుకదా అని హాయిగా నవ్వుకుని వెళ్ళిపోతారు.

* * *

బులుసుకామేశంగారు పోయేకా కొన్నాళ్ళకి ఆదెమ్మగారుకూడా కాలం చేశారు.

అంత పెద్ద లోగిలి ఖాళీగా పడుంది. ఎలకలూ, గబ్బిలాలూ తిరుగుతున్నాయి. మొన్న వర్షాలకి ఆగ్నేయం మూల ప్రహారీ పడిపోయింది. రావిమొక్కలు పగిలిన గోడ బీటల్లో మొలిచి బయటి కొస్తున్నాయి. ఒకరోజు గరికిపాటి చిట్టిగారింటికి ఏదో పనిమీద వచ్చిన నర్సిరెడ్డి కన్ను కామేశంగారింటి మీద పడింది. ఈ ఇంట్లో ఒక కాన్వెంటు పెడితేనో అనిపించింది.

గవరారెడ్డికీ, లచ్చారెడ్డికీ చెప్పాడు.

''చాలా బాగుంటది'' అన్నారు వాళ్ళంతా.

కాన్వెంటు పెడతాం మీ మండువాలోగిలి మాకు అద్దెకి ఇస్తారా అని అమెరికాలో వుంటున్న కామేశంగారి పిల్లలకి ఉత్తరం రాసేడు నర్సిరెడ్డి.

పెట్టుకోండి అద్దె వద్దు మా లోగిల్ని జాగ్రత్తగా చూసుకోండి చాలు అని జవాబు రాసేరాళ్ళు.

చాలా ఆనందపడ్డారు నర్సిరెడ్డి అన్నదమ్ములు.

కాన్వెంట్ పెట్టి ఏదో చదువు చెప్పాలనుకున్నారు గానీ ఏమేం చెయ్యాలి టీచర్లని ఎక్కడ్నించి తీసుకురావాలి, అసలు కాన్వెంటు నడిపే పద్ధతులేవీ తెలీవు పెట్టుబడి ఎంతవుద్దో బొత్తిగా తెలీదు.

ఎలాగా అని ఆలోచిస్తుండగా కుతుకులూరునించి కాకినాడెళ్ళి కాన్వెంటు పెట్టి చాలా గొప్ప వెలుగుని చూస్తున్న ఆదిత్యకృష్ణారెడ్డిగార్ని కలిశాడు. శ్రమపడి పైకొచ్చిన మనిషికృష్ణారెడ్డి. ముందు పర్నిచర్‌కి ఎంతవుద్దో తర్వాత నెలకి టీచర్ల జీతాల కెంతవుద్దో కృష్ణారెడ్డి వివరంగా చెప్పేసరికి ఈ పని మావల్ల కానిది అనుకుని తిరుగు బస్సెక్కి చీకటి పడేవేళకి ఊళ్ళోకి దిగాడు నర్సిరెడ్డి.

అరుగుమీద కూర్చుని అన్నగారికోసం ఎదురుచూస్తున్న తమ్ముళ్ళిద్దరి దగ్గరికీ వచ్చి ఇది మన వల్ల కాని పని అని వివరంగా చెప్పాడు నర్సిరెడ్డి.

ముగ్గురి మధ్యా పెద్ద చర్చే జరిగింది.

ఇల్లు ఆ బ్రాహ్మలు ఫ్రీగా ఇచ్చారు బాగానే వుంది. ఉన్న రెండెకరాల పొలం మీదా కుయ్యేరుబాబ్జీగారి లాంటి షావుకారు దగ్గరకెళ్ళి ఎంతో కొంత అప్పు తెచ్చి కుర్చీలూ, బల్లలూ చేయించి మొదలెట్టొచ్చు. ఇక మిగిలింది టీచర్ల సంగతి. కేరళ నించి వచ్చిన టీచర్లయితే పాఠాలు బాగా చెబుతారట. వాళ్ళ జీతాల సంగతేంటి? ఎక్కడ్నించో తీసుకొచ్చిన వాళ్ళకి నెలయ్యేసరికి జీతాలు ఇవ్వకపోతే ఎంత పరువునష్టం?

ఆ విషయమ్మై చాలా సేపు మాటాడుకున్నారు.

చివరికి ''ఈ కాన్వెంటు పెట్టడమనేది మన వల్లకాని పనిలే'' అనేసుకున్నారు.

బాగా రాత్రయింది.

ఆ పూట భోజనం చెయ్యబుద్ధవలేదు నర్సిరెడ్డికి పది దాటాకా రోజూలాగే లాంతరు తీసుకుని తెలుకుల రవణ ఇంటికి బయల్దేరేడు.

అప్పుడే గానుగదిగి ఆఖరు వాయ తీసేసి మాలక్ష్మిని దొడ్లోకి పంపిన రవణ వంటపాకలో కాగుతున్న సీవండి నీళ్ళబిందిని స్నానాల దడిలోకి తీసుకెళ్ళింది.

నర్సిరెడ్డి వచ్చేడు. నవారు మంచంమీద వాల్చి పరుపూ దుప్పటీ వేసి ''కాకినాడెళ్ళారు గదా ఏవయిందా పని?'' అంది.

జరిగిందంతా చెప్పి 'మొదలెట్టిన ఆర్నెల్లదాకా మేస్టర్లకి జీతాలివ్వలేం అందుకని కాన్వెంటు పెట్టే ఆలోచన మానుకుంటున్నాం'' అన్నాడు.

కాసేపు ఆలోచించిన రవణ ''ఓ పని చేస్తేనో'' అంది.

ఏంటన్నట్టు చూశాడు నర్సిరెడ్డి.

''మీకు తెల్సు నేనేం చదువుకున్న దాన్ని కాదు. నే చెప్పిందంతా విన్నాకా నవ్వుకోగూడదు''.

''పర్లేదు చెప్పు''.

ఆకాశంలో చుక్కలన్నీ అందంగా మెరుస్తున్నాయి. గొల్లకావిడీ పిల్లలకోడీ చాలా బాగా కనిపిస్తున్నాయా వేళ. ఉన్నట్టుండి గాలి తిరగింది. ఆ గాలికి రవణ ఇంటిని ఆన్చి ఉన్న వేపచెట్టు కొమ్మలు జాయిగా ఊగుతున్నాయి. పల్చగా వీస్తున్న ఆ గాలికి పెద్దాపురం చేంతాడుతో గుమ్మానికి వేలాడగట్టిన హరికెన్‌లాంతరు అటూ ఇటూ ఊగుతుంటే ఆ లాంతరు వెలుగు రవణ ముఖం మీద పడి మళ్ళీ వెళ్లిపోతుంది.

మరి చెప్పడం మొదలెట్టింది రవణ.

''అసలు మేష్టార్లనే పెట్టొద్దు... అవునండి అసలు మేస్టర్లనే పెట్టొద్దు'' అంది రవణ.

''ఏంటి అంటున్నావు?'' అన్నాడు నర్సిరెడ్డి.

''చెప్పేది పూర్తిగా వినండి. అసలు మేస్టర్లనే పెట్టొద్దు. ఒకటోక్లాసులో పిల్లలకి పాఠాలు రెండోక్లాసులో బాగా తెలివిగల కుర్రాడు చెబుతాడు. రెండోక్లాసుకి మూడోక్లాసూ కుర్రాడు చెబుతాడు. మూడోక్లాసుకుర్రోళ్ళకి నాలుగోక్లాసులో కుర్రోడూ నాలుగోక్లాసు పిల్లలకి అయిదోక్లాసబ్బాయిూ చెపుతారు. అయిదో క్లాసోళ్లకి మట్టుకు మన చిన్నోడో పెద్దోడో చెబుతారు. మీరు క్లాసులన్నీ తిరుగుతా పాఠాలు సరిగా చెపుతున్నారో లేదో పైపైన చూసుకోండి. ఓ ఏడాది గడిస్తే బండి గాడిలో పడద్ది''.

ఇంత చదువుకున్న తమకి రాని ఈ గొప్ప అయిడియా ఆ మనిషికొచ్చినందుకు తెగ మురిసిపోయిన నర్సిరెడ్డి మనసారా కౌగిలించుకున్నాడు తన రవణని.

గోదావరికెనాల్‌సైడ్ కాన్వెంట్ అని పేరు పెట్టి మొదలెట్టేరు.

చాలా తక్కువకాలంలో చాలా పేరెల్లిపోయింది కాన్వెంట్.

కొన్నాళ్ళు గడిచాక ఆ వెన్నెలరాత్రి ఇంటి వెనక దొడ్లో ఇంటిల్లపాదీ కూర్చున్నారు. మధ్యలో రవణుంది.

"పుంతరేవు దిగువలో కర్రి సత్తిరాజుగారి పొలం పక్కన పదెకరాల పొలం అమ్మకానికుందంట అది మనం కొనేద్దాం... ఏవంటారు?" అంది రవణ.

"కొనేసి ఏం జెయ్యాలి?" అన్నాడు నర్సిరెడ్డి.

"స్కూలు అక్కడ కడదాం" అంది రవణ.

"స్కూలు అంతదూరంలో ఎందుకు కట్టాలి?" ఎదురడిగేడు నర్సిరెడ్డి.

"ఊరుకి చివర గోదావరి కాలవ పక్కన పైగా ఆపొలంలో పదివేప చెట్లున్నాయంట పిల్లలకెంత ఆరోగ్యం జెప్పండి" అనేసరికి ఇంకెవరూ ఎదురు మాటాడ్లేదు రవణకి.

ఆ స్థలం కొనేసేకా హాస్టలుకూడా పెడదాం అన్న ఆలోచన రావడంతో చాలా పెద్ద బిల్డింగులు రెండు కట్టేరు.

నర్సిరెడ్డి మొత్తం స్కూలు పన్లన్నీ చూసుకుంటున్నాడు పూర్వంలాగే అతని మాటకి తిరుగులేదు. రెండోవాడు గవరారెడ్డి డబ్బుకి సంబంధించిన వ్యవహారాలు చూసుకుంటున్నాడు. ఇంట్లో ఎవరికి ఏపైసా కావాలన్నా అతన్నే అడగాలి మూడోవాడు లచ్చారెడ్డి స్కూలూ హాస్టలుకి కావాల్సిన సామాన్లు తెచ్చే పనులు చూస్తున్నాడు. గవరారెడ్డి భార్య సూరేకాంతం హాస్టలు నడుపుతుంది. వంటలు బాగా చెయ్యడం తెల్సిన లచ్చారెడ్డి భార్య విజయలక్ష్మి హాస్టల్లో వంటల పన్లు చూస్తుంది.

గోదావరికెనాల్‌సైడ్ కాన్వెంటులో పిల్లల్ని జేర్చడానికి ఎక్కడెక్కడినించో దిగిపోతున్నారు తల్లిదండ్రులు.

మరికొన్నాళ్లు గడిచాక తమ ఉమ్మడికుటుంబంకోసం కాన్వెంట్‌బిల్డింగ్‌కి కాస్త దూరంగా పెద్ద మండువా లోగిలి కట్టించాడు నర్సిరెడ్డి. తమ్ముళ్ళు మరదళ్ళు కల్సి రవణకోసం ప్రత్యేకమైన గది ఏర్పాటుచేసి ఒకరోజు ఆమెని లాక్కొచ్చి పందిరిపట్టిమంచం మీద కుర్చోబెట్టారు.

ఛెంగున గంతేసి దిగిపోయిన రవణ "మారాణీలాగ నేనీ గదిలో కూర్చుంటే నా గానుగెవరు తిప్పుతారు అవతల మా మాలక్ష్మి ఏమైపోద్ది... అయినా నాకింత వైభోగం ఎందుకు చెప్పండి మానర్సిరెడ్డిగారు సుకంగా ఉన్నంతకాలం నాకు రాజభోగమే గదా" అని పరుగెట్టింది సత్తెమ్మగుడి సందులో ఉన్న తన గానుగ దగ్గరకి.

* * *